

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి తెల్లవారుజాము

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 187 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు శనివారం, నవంబరు 07, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



ప్రభుత్వ పథకాల లబ్ధికి ఓటర్ ఐడీ..!!

- బీజేపీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- ఎన్నికలను తారుమారు చేసి ప్రజల ఓటు హక్కును హరించేందుకు కుట్రలు పన్నుతోంది
- ప్రభుత్వ ప్రయోజనాలను పొందడాన్ని ఓటర్ల జాబితాలతో ముడిపెడుతున్నారు...
- బీజేపీని విమర్శించే వారిని లక్ష్యంగా చేసుకుని సంక్షేమ పథకాల ప్రయోజనాలను
- నిరాకరించే పరిస్థితి ఏర్పడవచ్చని అనుమానం వ్యక్తం చేశారు..
- వారు బీజేపీపై ఆగ్రహంతో ఉన్న ప్రజలనే లక్ష్యంగా చేసుకుంటున్నారు..
- ఓటర్ల జాబితాలను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకుందన్న రాహుల్..
- 'ఓటర్ల జాబితాలు నిష్పక్షపాతంగా వ్యవహరించే ఎన్నికల సంఘం చేతిలో ఉండాలి
- ఓట్ల చోరీలో బీజేపీతో కుమ్మక్కైన ఆయనను ఆధారాలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం
- కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ

2 లో

ఏపీ పురపాలికల్లో ఒక వార్డ్ గెలుచుకున్న కాంగ్రెస్...

ఆమంచి కృష్ణ మోహన్ ఎఫెక్ట్..



ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ బోణీ కొట్టింది. చీరాల మున్సిపాలిటీలోని 25వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి వెంకట్రావు విజయం సాధించారు. చీరాల మున్సిపాలిటీకి ఈ నెల 1వ తేదీన ఎన్నికలు జరగ్గా, 3వ తేదీన వర్షం కారణంగా ఇక్కడ కౌంటింగ్ నిలిచిపోయింది. తాజాగా ఈ రోజు నిర్వహించిన కౌంటింగ్‌లో కాంగ్రెస్ ఈ విజయాన్ని నమోదు చేసుకుంది.



ప్రధానిని కలిసిన... సూర్యకుమార్ యాదవ్..

చిన్నారులతో సరదాగా గడిపిన మోదీ..

భారత క్రికెట్ జట్టు మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన కుటుంబంతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశాడు. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా సూర్యకుమార్ కుటుంబంతో ప్రధాని మోదీ ఆప్యాయంగా మాట్లాడారు. ముఖ్యంగా సూర్యకుమార్ పిల్లలతో మోదీ సరదాగా గడపడం ఈ సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సూర్యకుమార్ యాదవ్ 2026 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయం సందర్భంగా అందుకున్న బంగారు పతకాన్ని ధరించి ఈ సమావేశంలో కనిపించాడు. సూర్యకుమార్ యాదవ్ మెడల్‌ను ప్రధాని మోదీ చేతిలోకి తీసుకుని పరిశీలించారు. ప్రపంచకప్ విజయాన్ని గుర్తుచేసుకుంటూ ఇద్దరూ ప్రత్యేక క్షణాలను పంచుకున్నారు. 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు టైటిల్‌ను నిలబెట్టుకోవడంలో సూర్యకుమార్ కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించి మరోసారి ప్రపంచ విజేతగా నిలపడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఈ సమావేశంలో సూర్యకుమార్ కుమార్తె రిద్దిమా ప్రధాని మోదీ ముందు భక్తి గీతం ఆలపించింది. చిన్నారి పాటను మోదీ ఆసక్తిగా విన్నారు



తమిళ జాలర్ల మృతిపై చంద్రబాబు, పవన్...

తీవ్ర విచారం !!

మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి

గల్లంతైన ఇద్దరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలి

- తుపాను కారణంగా తలెత్తిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే ఈ ప్రమాదం జరిగింది
- సమన్వయంతో పనిచేయాలని కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులకు సూచనలు
- పోస్టుమార్టం తదితర ప్రక్రియలు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశం
- తమిళనాడు అధికారులతో సమన్వయం చేసుకుని మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపాలి

అమరావతి : ప్రకాశం జిల్లా కొత్తపట్నం వద్ద బోటు మునిగి తమిళనాడుకు చెందిన జాలర్ల మృతి ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి అనిత విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈనెల 3న తమిళనాడుకు చెందిన మత్స్యకారుల బోటు.. ప్రకాశం జిల్లా కొత్తపట్నం వద్ద సముద్రంలో బోల్తా పడి తీరానికి కొట్టుకొచ్చిన విషయం తెలిసిందే. బోటులో మొత్తం 9 మంది ఉండగా... ఏడుగురు మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. 'మురసు' తుఫాన్ ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. గల్లంతైన ఇద్దరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. సమన్వయంతో పనిచేయాలని కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులకు సూచనలు చేశారు. పోస్టుమార్టం తదితర ప్రక్రియలు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. తమిళనాడు అధికారులతో సమన్వయం చేసుకుని మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.



బోటు ప్రమాదంపై హోంమంత్రి.. తమిళనాడు మత్స్యకారుల బోటు ప్రమాదంపై హోంమంత్రి అనిత విచారం వ్యక్తం చేస్తూ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తుఫాన్ ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే ప్రమాదం జరిగిందన్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు సమన్వయంతో పనిచేయాలని హోం మంత్రి అనిత సూచించారు.



ప్రకాశం జిల్లా కొత్తపట్నం వద్ద బోటు మునిగి తమిళనాడుకు చెందిన జాలర్ల మృతి ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి అనిత విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గల్లంతైన మరో ఇద్దరి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. తుపాను కారణంగా తలెత్తిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే ఈ ప్రమాదం జరిగిందని మంత్రి అనిత అన్నారు. కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు సమన్వయంతో పనిచేసి.. గాలింపు చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

తెలంగాణ ప్రజలకు దీపావళి కానుక..

మెట్రో-ఆర్టీసీ నెలవారీ పాస్ ధర...

భారీగా తగ్గింపు..!!

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రూ.8500 ఉన్న నెలవారీ పాస్ ధర రూ.4000కు తగ్గింపు

ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గించి, ప్రజా రవాణా సేవలను అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యం

- ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజువారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను రూ.275కు తగ్గించాం
- ఇందులో రూ.200 మెట్రో ప్రయాణానికి, రూ.75 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించాం..
- ఈ పాస్ ద్వారా రోజుకు 4 సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుంది..
- ప్రస్తుతం రూ.8,500గా ఉన్న నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను రూ.4,000కు తగ్గించాం
- రూ.3,000 మెట్రో ప్రయాణానికి, రూ.1,000 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించాం...
- ఈ పాస్ ద్వారా నెలలో గరిష్ఠంగా 50 రౌండ్ ట్రిప్పులకు అనుమతి ఉంటుంది..
- ప్రభుత్వం ప్రకటించిన తగ్గింపు ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి వస్తాయి...
- ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఎంతో ఊరటనిస్తుంది...
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

2 లో





హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రూ.8500 ఉన్న నెలవారీ పాస్ ధర రూ.4000కు తగ్గించినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గించి, ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

మళ్లీ కెమెరా ముందుకు...

సీఎం విజయ్..

సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీవీకే ప్రభుత్వం కొత్త ప్రయత్నాలు చేస్తోంది...

మామూలుగా అయితే ప్రభుత్వం బ్రాండ్ అంబాసిడర్లను నియమించుకుంటుంది

ఆయన్నే పెట్టి ఒక భారీ యాడ్‌కు ప్లాన్..స్టార్ డైరెక్టర్ గౌతమ్ మేనన్ రంగంలోకి..

ఒక సినిమా స్థాయిలో తీసేలా బడ్జెట్ ఎక్కువగానే కేటాయించారని సమాచారం

తిరుచ్చి ఈస్ట్, పెరుంతురై, అంబాసముద్రం, విరాలిమలై,

కరూర్ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరగాలి

దీపావళి తర్వాత వాటిని నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది

ఇక ఈ షూటింగ్ వార్తలతో విజయ్ ఫ్యాన్స్‌లోనూ సందడి నెలకొంది

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మళ్లీ కెమెరా ముందుకు వస్తున్నారు. అదేంటీ ఆయన నటించనని చెప్పారు కదా.. మళ్లీ యాక్టింగ్ ఏంటి అనుకుంటున్నారా..? ఇంతకీ విషయం ఏంటంటే..? సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీవీకే ప్రభుత్వం కొత్త ప్రయత్నాలు చేస్తోంది. మామూలుగా అయితే ప్రభుత్వం బ్రాండ్ అంబాసిడర్లను నియమించుకుంటుంది. కొన్ని సార్లు సినీనటులూ నటిస్తుంటారు. అయితే తమిళనాడు ప్రభుత్వం విజయ్ కంటే బిగ్ స్టార్ ఎవరున్నారని భావించిందో ఏమో.. ఆయన్నే పెట్టి ఒక భారీ యాడ్‌కు ప్లాన్ చేసింది. స్టార్ డైరెక్టర్ గౌతమ్ మేనన్‌ను రంగంలోకి దింపింది. ఒక సినిమా స్థాయిలో తీసేలా బడ్జెట్ ఎక్కువగానే కేటాయించారని సమాచారం. టీవీకే చీఫ్, సీఎంగా విజయ్‌కున్న బాధ్యతల దృష్ట్యా



..2వ పేజీలో

ప్రభుత్వ పథకాల లబ్ధికి ఓటర్ ఐడీ..!!

బీజేపీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

ఎన్నికలను తారుమారు చేసి ప్రజల ఓటు హక్కును హరించేందుకు కుట్రలు పన్నుతోంది

ప్రభుత్వ ప్రయోజనాలను పొందడాన్ని ఓటర్ల జాబితాలతో ముడిపెడుతున్నారు...బీజేపీని విమర్శించే వారిని లక్ష్యంగా చేసుకుని సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరాకరించే పరిస్థితి ఏర్పడవచ్చని అనుమానం వ్యక్తం చేశారు..వారు బీజేపీపై ఆగ్రహంతో ఉన్న ప్రజలనే లక్ష్యంగా చేసుకుంటున్నారు..

ఓటర్ల జాబితాలను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకుందన్న రాహుల్.. 'ఓటర్ల జాబితాలు నిష్పక్షపాతంగా వ్యవహరించే ఎన్నికల సంఘం చేతిలో ఉండాలి

ఓట్ల చోరీలో బీజేపీతో కుమ్మక్కైన ఆయనను ఆధారాలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం....కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కేంద్రంలో శాశ్వతంగా అధికారంలో కొనసాగేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికలను తారుమారు చేసి ప్రజల ఓటు హక్కును హరించేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను నిర్ధారించడానికి ఆధార్ కార్డులకు బదులుగా ఓటర్ ఐడీ కార్డులను ఉపయోగిస్తామని కేంద్ర మంత్రి లలన్ సింగ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందిస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఆధార్‌కు బదులుగా ఓటర్ ఐడీ ఆధారంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయడం పౌరుల ప్రాథమిక హక్కులకు ముప్పు కలిగించవచ్చని ఎంపీ రాహుల్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ప్రయోజనాలను పొందడాన్ని ఓటర్ల జాబితాలతో ముడిపెడుతున్నారని, అయితే ఆ జాబితాలను ఇప్పటికే తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీని వ్యతిరేకించే లేదా విమర్శించే లక్షలాది మంది పేర్లను తొలగించడానికి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఉపయోగిస్తున్నారని చెప్పుకొచ్చారు. బీజేపీని విమర్శించే వారిని లక్ష్యంగా చేసుకుని సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరాకరించే పరిస్థితి ఏర్పడవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియను ఆపకపోతే ఓటర్ల జాబితా నుంచి మరిన్ని పేర్లు



తొలగించే అవకాశం ఉందని ఆరోపించారు. వారు బీజేపీపై ఆగ్రహంతో ఉన్న ప్రజలనే లక్ష్యంగా చేసుకుంటున్నారని రాహుల్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకుందన్న రాహుల్.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పాత్రనూ ప్రశ్నించారు. 'ఓటర్ల జాబితాలు నిష్పక్షపాతంగా వ్యవహరించే ఎన్నికల సంఘం చేతిలో ఉండాలి. కానీ, ఇప్పుడు అవి మోదీ ప్రభుత్వ ఉద్యోగి జ్ఞానేశ్ కుమార్ చేతిలో ఉన్నాయి. ఓట్ల చోరీలో బీజేపీతో కుమ్మక్కైన ఆయనను ఆధారాలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం. ఎల్లప్పుడూ బీజేపీకే మెజారిటీ వచ్చేలా జాబితాను రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పుడు అదే జాబితా మీకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతాయో లేదో నిర్ణయిస్తుంది. ఇది హైజాక్ చేయబడిన ప్రజాస్వామ్యం. ఇక్కడ ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం లేదు, ప్రభుత్వమే తనకు అనుకూలమైన వ్యక్తులను ఎన్నుకుంటోంది' అని రాహుల్ విమర్శించారు. కాగా, రాహుల్ గాంధీ షేర్ చేసిన వీడియోలో కేంద్ర మంత్రి లలన్ సింగ్ మాట్లాడుతూ.. 'ఇకపై లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల చెల్లింపుల కోసం ఆధార్ కార్డు ప్రాతిపదికగా ఉండదు. ప్రతి వీధిలోని సంస్థల్లో ఇప్పుడు ఆధార్ కార్డు అందుబాటులో ఉంది. వారిని అడిగితే చాలు, ఐదు నిమిషాల్లో మీకు ఆధార్ కార్డును సిద్ధం చేసి ఇస్తారు. కాబట్టి, ఇకపై ఆధార్ కార్డు ప్రాతిపదిక కాదు. లబ్ధిదారులందరికీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్, ఓటర్ ఐడీ నంబర్ ప్రాతిపదికగా ఉంటాయి. వాటి ఆధారంగానే చెల్లింపులు జరుగుతాయి' అని పేర్కొన్నారు.


మళ్లీ కెమెరా ముందుకు సీఎం విజయ్..

(మొదటిపేజీ తరువాయి) ఈ షూటింగ్ ఇప్పుడే ప్రారంభం కాకపోవచ్చని, ఉప ఎన్నికల తర్వాత జరగొచ్చని తెలుస్తోంది. రాష్ట్రం లో ఖాళీ అయిన 7 స్థానాల్లో మధురాం తకం, ధారాపురం నియోకవర్గాలకు ఇటీ వల ఉప ఎన్నికలను నిర్వహించగా అం దులో టీవీకే విజయకేతనం ఎగరవేసిం ది. తిరుచ్చి ఈస్ట్, పెరుంతురై, అంబా స ముద్రం, విరాలిమలై, కరూర్ నియోజక వర్గాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉం ది. దీపావళి తర్వాత వాటిని నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. ఇక ఈ షూటింగ్ వార్తలతో విజయ్ ఫ్యాన్స్‌లోనూ సందడి నెలకొంది. ఆయన సీఎం అయిన తర్వాత చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలైన సంగతి తెలిసిందే.

తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో షాక్..

దీపావళి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

తెహెల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. 2013 నాటి అత్యాచార కేసులో ఆయనకు విధించిన పదేళ్ల జైలుశిక్షను నిలిపివేయడానికి, దీపావళి సందర్భంగా



మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తన శిక్షను నిలిపివేయాలని కోరుతూ తేజ్‌పాల్ దాఖలు చేసిన పిటిషిన్ విచారణ సందర్భంగా.. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి వరాలేతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తనపై వచ్చిన అభియోగాన్ని, శిక్షను సవాల్ చేస్తున్న తేజ్‌పాల్‌కు ఉపశమనం కల్పించేందుకు తాము సుముఖంగా లేమని ధర్మాసనం పేర్కొంది. కాగా.. బాంబే హైకోర్టు తీర్పుపై తేజ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగా.. దీపావళి సందర్భంగా మధ్యంతర బెయిల్ కోరుతూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తేజ్‌పాల్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్.. దీపావళికి తేజ్‌పాల్‌ను ఇంటికి పంపేందుకు అనుమతించాలని అభ్యర్థించారు. అయితే.. ఈ వాదనల్ని గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు.

ఇదీ కేసు.. గోవాలో 2013 నవంబర్‌లో నిర్వహించిన థింక్‌ఫెస్ట్ కార్యక్రమం సందర్భంగా ఓ మహిళా సహోద్యోగిపై తరుణ్ తేజ్‌పాల్ లైంగిక దాడికి పాల్పడ్డారంటూ కేసు నమోదైంది. 2021లో తేజ్‌పాల్‌ను గోవా సెషన్స్ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. అయితే.. ఈ తీర్పును ఆ రాష్ట్ర ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాల్ చేసింది. విచారణ అనంతరం హైకోర్టు ఆయన్ను దోషిగా తేల్చి.. పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,21,000 జరిమానా విధిస్తూ 4 వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు తేజ్‌పాల్. లొంగిపోవడం నుంచి తనకు తక్షణమే మినహాయింపు కల్పించాలని కోరారు. కానీ ఆయన అభ్యర్థనను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది.

పంజాబ్‌లో కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం..

నాలుగు బోగీలు దగ్ధం

పంజాబ్: సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు చెందిన నాలుగు కోచ్‌లలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ



ప్రమాదంలో నాలుగు బోగీలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. అయితే, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృత్‌సర్ నుంచి న్యూ జల్పాయ్‌గురి వెళ్తున్న 12508 నంబర్ కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సరాయ్ బంజారా స్టేషన్ సమీపానికి రాగానే ఇంజిన్ నుంచి ఐదో బోగీలో తొలుత మంటలు కనిపించాయి. ఆ తర్వాత మరో మూడు బోగీలకు వ్యాపించాయి. దీంతో రైలులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి రైలును నిలిపివేయడంతో ప్రయాణికులంతా సురక్షితంగా దిగిపోయారు. ప్రయాణికులు పెను ముప్పు నుంచి తప్పించుకోవడంతో భారీగా ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, అత్యవసర సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. రైలు బోగీల్లో పెద్దఎత్తున మంటలు ఎగసిపడుతుండటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ప్రజలకు దీపావళి కానుక..
మెట్రో-ఆర్టీసీ నెలవారీ పాస్ ధర భారీగా తగ్గింపు..!!

(మొదటిపేజీ తరువాయి) "ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజువారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను రూ.275కు తగ్గించాం. ఇందులో రూ.200 మెట్రో ప్రయాణానికి, రూ.75 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించాం. ఈ పాస్ ద్వారా రోజుకు 4 సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుంది. ప్రస్తుతం రూ.8,500గా ఉన్న నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను ఏకంగా రూ.4,000కు తగ్గించాం. ఇందులో రూ.3,000 మెట్రో ప్రయాణానికి, రూ.1,000 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయించాం. ఈ పాస్ ద్వారా నెలలో గరిష్ఠంగా 50 రౌండ్ ట్రిప్పులకు అనుమతి ఉంటుంది. ఈ ధరల తగ్గింపుతో నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ వినియోగదారులకు రూ.4,500 ఆదా అవుతుంది. రోజువారీ ఉమ్మడి పాస్ వినియోగదారులకు రూ.125 ఆదా అవుతుంది. ప్రభుత్వం ప్రకటించిన తగ్గింపు ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి వస్తాయి. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత సంస్థలను ఆదేశించాం. ప్రజల సంక్షేమం, ప్రయాణికుల ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఎంతో ఊరటనిస్తుంది" అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ఏపీ పురపాలికల్లో ఒక వార్డ్ గెలుచుకున్న కాంగ్రెస్...

ఆమంచి కృష్ణ మోహన్ ఎఫెక్ట్..

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ బోణీ కొట్టింది. చీరాల మున్సిపాలిటీలోని 25వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి వెంకట్రావు విజయం సాధించారు. చీరాల మున్సిపాలిటీకి ఈ నెల 1వ తేదీన ఎన్నికలు జరగ్గా, 3వ తేదీన వర్షం కారణంగా ఇక్కడ కౌంటింగ్ నిలిచిపోయింది. తాజాగా ఈ రోజు నిర్వహించిన కౌంటింగ్‌లో కాంగ్రెస్ ఈ విజయాన్ని నమోదు చేసుకుంది.

ఏపీలో స్థానిక సంస్థల ఉప ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో 1వ తేదీన పోలింగ్ ముగియగా, నవంబర్ 3న ఫలితాలు వెలువడ్డాయి. అయితే ఆ రోజు తుపాను ప్రభావంతో చీరాలలో భారీ వర్షం కురవడంతో కౌంటింగ్ ప్రక్రియను ఎన్నికల సంఘం వాయిదా వేసింది. దాంతో తాజాగా నేడు అక్కడ ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ కౌంటింగ్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ తొలి విజయాన్ని అందుకుంది. రాష్ట్రవ్యాప్తంగా



కూటమి పార్టీలు, వైసీపీల మధ్య హోరాహోరీ పోరు సాగుతుండగా.. కాంగ్రెస్ పార్టీ చీరాల మున్సిపాలిటీలో ఖాతా తెరిచింది. చీరాల 25వ వార్డు నుంచి బరిలోకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి వెంకట్రావు ఘన విజయం సాధించారు. ఈ 25వ వార్డులో బీజేపీ అభ్యర్థి రెండో స్థానంలో, వైసీపీ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. ఇక 22వ వార్డును టీడీపీ అభ్యర్థి కైవసం చేసుకోగా, అక్కడ కాంగ్రెస్ రెండో స్థానంలో, వైసీపీ మూడో స్థానంలో నిలిచాయి.ఇక చీరాలలో కౌంటింగ్ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడ కౌంటింగ్ జరగనుంది.

సంపాదకీయం

కలిసొచ్చిన 'యాంటీ- ఏఐ' సెంటిమెంట్..

సెన్సెక్స్ 1100 పాయింట్లుపైకి...

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు దూసుకెళుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు ఉన్నా.. మన మార్కెట్లు రాణిస్తుండడం విశేషం. ఇన్నాళ్లూ ఏఐ పెట్టుబడులు లేవన్న కారణంగా ఏ మదుపర్లయితే భారతీయ స్టాక్ మార్కెట్‌ను పక్కన పెట్టారో.. ఇప్పుడు 'యాంటీ ఏఐ' సెంటిమెంట్‌తో వారే కొనుగోళ్లకు దిగడం సూచీలకు కలిసొచ్చింది. ఈ క్రమంలో సెన్సెక్స్ ఏకంగా 1100 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 24,800 మార్కును అందుకుంది. సెన్సెక్స్ ఉదయం 79,413.66 (క్రితం ముగింపు 79,310.01) పాయింట్ల వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. కాసేపటికే భారీ లాభాల్లోకి వచ్చింది. మధ్యాహ్నం 2 గంటల సమయానికి సెన్సెక్స్ 1095 పాయింట్ల లాభంతో 80,405 పాయింట్ల వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 259 పాయింట్ల లాభంతో 24,795 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్‌ఫార్మా షేర్లు భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బీఈఎల్, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి.



కారణాలు ఇవీ.. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు విజయం సాధించడంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగానికి సంబంధించిన నిబంధనలు కఠినతరం కానున్నాయన్న ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అదే సమయంలో దీనివల్ల భారత్ 'యాంటీ-ఏఐ' ప్రయోజనాన్ని పొందుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. విదేశీ సంస్థాగత మదుపర్లు (FII) గురువారం ఒక్కరోజే ఏకంగా రూ.14,975 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. గత ఆరు సంవత్సరాలలో ఒక్క రోజులో ఈ స్థాయిలో విదేశీ పెట్టుబడులు రావడం ఇదే మొదటిసారి. దీంతో మార్కెట్ సెంటిమెంట్ బలపడింది. కంపెనీల రెండో త్రైమాసిక ఫలితాలు అంచనాల కంటే మెరుగ్గా ఉండటం మార్కెట్‌కు దన్నుగా నిలిచింది. దీనికితోడు లార్జ్ క్యాప్ షేర్లు గత కొంతకాలంగా పతనం కావడంతో ప్రస్తుతం అవి ఆకర్షణీయంగా మారాయి. దీంతో వాటి కొనుగోలుకు ఆసక్తి చూపుతుండటం మార్కెట్ పెరుగుదలకు దోహదం చేసిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

తుపాన్ల వల్ల కోస్తా రైతులు తరచు నష్టపోతున్నారు
: సీఎం చంద్రబాబు

కాకుమాను: తుపాన్ల వల్ల కోస్తా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం.. ఏరియల్ సర్వే నిర్వహించారు. బాపట్ల, గుంటూరు జిల్లాల పర్యటనకు వెళ్తున్న సమయంలో హెలికాప్టర్ ద్వారా పంట నష్టాన్ని పరిశీలించారు. హెలికాప్టర్‌లో సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్లో దిగి..



అక్కడి నుంచి రోడ్డు మార్గాన బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్దకు చేరుకున్నారు. మురసు తుపానుకు గండ్లు పడిన డ్రెయిన్‌ను పరిశీలించి.. నీటిపారుదలశాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి గుంటూరు జిల్లా కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చేరుకుని దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. డ్రెయిన్లకు గండ్లు పడిన కారణంగా నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. "తుపాను కారణంగా గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుపాను వల్ల నష్టం తగ్గించేందుకు ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. పంటల బీమా కట్టాలని ప్రతి రైతును కోరుతున్నాం. మొన్నటి వరకు ఎల్‌నినోతో ఇబ్బందులు.. ఇప్పుడు తుపాన్లు దెబ్బతీశాయి. వరుసగా రెండు తుపాన్లు రావడం చరిత్రలో మొదటి సారి" అని సీఎం అన్నారు.

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల రీ పోలింగ్..

కర్నూలు జిల్లాలో అత్యధిక ఓటింగ్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల రీ పోలింగ్ ప్రక్రియ ఈరోజు (శుక్రవారం) కొనసాగుతోంది. ఏపీవ్యాప్తంగా మొత్తం 211 పోలింగ్



కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ జరుగుతోంది. ఇవాళ మధ్యాహ్నం 1 గంట వరకు సగటున 41.74 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 9 గంటలకు 12.56 శాతం, ఉదయం 11 గంటలకు 26.95 శాతంగా పోలింగ్ రికార్డైంది . అత్యధికంగా కర్నూలు జిల్లా కోసిగి, అర్లబండలో 53.35 శాతం పోలింగ్ నమోదైంది. మార్కాపురం జిల్లా పుల్లలచెరువు, గంగవరంలో 51.19 శాతం పోలింగ్ శాతం రికార్డు అయింది. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో 49.9 శాతం, పల్నాడు జిల్లా క్రోసూరు, అందుకూరులో 39.37 శాతం, అనంతపురం జిల్లా కుదేరు, మరుట్లలో 39.29 శాతం, ఏలూరు జిల్లా జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడులో 32.23 శాతం పోలింగ్ నమోదు అయింది. అత్యల్పంగా శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం, పొన్నంలో 26.82 శాతం పోలింగ్ రికార్డు అయింది.

చీరాలలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్... మరోవైపు, బాపట్ల జిల్లాలోని చీరాలలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. 20 వార్డుల్లో ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటించారు. టీడీపీ - 13, వైసీపీ - 3, కాంగ్రెస్ - 4 వార్డులు వచ్చాయి. తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి హనీ స్పందన 2,900 ఓట్ల మెజారిటీలో ఉన్నారు.

గన్నవరంలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ... కృష్ణా జిల్లాలోని గన్నవరంలో కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. గన్నవరం సెయింట్ జాన్స్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలోని కౌంటింగ్ అధికారులకు స్వయంగా శిక్షణ సూచనలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేశారు.

నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

అనంతపురం, నవంబరు 06, అమరావతి వెలుగు : నగర అభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు పనిచేయాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు, అనంతపురం నియోజకవర్గ సమన్వయకర్త



అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలన్నారు. శుక్రవారం వైకాపా జిల్లా కార్యాలయంలో మేయర్‌గా ఎన్నికైన రమేష్‌గౌడ్‌తో పాటు కార్పొరేటర్లుగా గెలుపొందిన, ఓటమి చెందిన అభ్యర్థులు, స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడ్డారని తెలిపారు. అధికార పార్టీ నేతల దాడులు, దౌర్జన్యాలకు భయపడకుండా కార్యకర్తలు నిలబడ్డారని పేర్కొన్నారు. కొన్ని డివిజన్లలో అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైనప్పటికీ నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. సమష్టి కృషితోనే మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోగలిగామని తెలిపారు. డివిజన్ స్థాయిలో



పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే



దిశగా కృషి చేయాలని, ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని అన్నారు. అవినీతి, వివాదాలకు దూరంగా ఉంటూ నగరాన్ని ప్రశాంతంగా, అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ప్రజలు



తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమన్వయంతో పనిచేసి అనంతపురం నగరపాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మేయర్, కార్పొరేటర్ పదవులు అధికారం చలాయించడానికి కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశాలని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు సైతం ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్లలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. మేయర్ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి అనంతపురం నగరాన్ని సుందరంగా, స్వచ్ఛంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. తనను మేయర్‌గా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలమయమైన జాతీయ రహదారి..
ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం!

టోల్ వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. రోడ్డు మరమ్మతులపై ఏదీ?

ఎస్.కే. గెస్ట్ హౌస్ వద్ద రెండు కార్లు ఢీ.. తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు

అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

అనంతపురం, నవంబరు 06, అమరావతి వెలుగు : జాతీయ రహదారిపై భద్రతా చర్యలు కరువై ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. రోడ్డు మరమ్మతుల పేరుతో









తవ్విన గుంతలను పూడ్చకుండా వదిలేయ డం, ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వాహనదా రులకు శాపంగా మారింది. అధికా రుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా గురువారం ఉదయం ఎస్.కే. యూనివర్సిటీ గెస్ట్ హౌస్ సమీపంలో రెండు కార్లు ఢీకొని తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు.జాతీయ రహదారిపై వీధి దీపాల మరమ్మతులు, విద్యుత్ కేబుళ్లు, స్తంభాల ఏర్పాటులో భాగంగా ఇటీవల రోడ్డును తవ్వారు. పనులు పూర్తయినప్పటికీ ఎస్.కే. యూనివర్సిటీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఏర్పడిన భారీ గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీనికితోడు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు.ఈ క్రమంలో గురువారం ఉదయం సవేరా ఆసుపత్రి మేనేజర్ సహాయకుడు నరేంద్ర తన కుమారుడితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై అకస్మాత్తుగా ఎదురైన గుంతలను తప్పించుకునేందుకు ముందున్న కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నరేంద్రతో పాటు ఆయన కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. రెండు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సవేరా ఆసుపత్రికి తరలించారు.

టోల్ వసూళ్లకే ప్రాధాన్యతా?.. టోల్ గేట్ల వద్ద ప్రయాణికుల నుంచి నిబంధనల ప్రకారం రుసుములు వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ రహదారి నిర్వహణలో ఎందుకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. టోల్ ఫీజులు వసూలు చేస్తున్న అధికారులు, ప్రయాణికులకు సురక్షితమైన రహదారులను అందించాల్సిన బాధ్యతను విస్మరించడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలకు నిలయంగా హైవే... అనంతపురం నుంచి మామిళ్లపల్లి వరకు జాతీయ రహదారిపై పలుచోట్ల భారీ గుంతలు, రోడ్డు ఎత్తుపల్లాలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారులపై తవ్వకాలు చేపట్టే సమయంలో భద్రతా చర్యలు తీసుకోవాలని, పనులు పూర్తయిన వెంటనే గుంతలను పూడ్చాలని డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఉన్నతాధికారులు స్పందించి ఎస్.కే. గెస్ట్ హౌస్ వద్ద ప్రమాదకరంగా మారిన గుంతలను తక్షణమే పూడ్చాలని, రహదారిపై ఉన్న ఇతర లోపాలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. మరో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించకముందే అధికారులు మేల్కొనాలని హెచ్చరిస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ...
ఏర్పాట్లు చేపట్టాలి

కౌంటింగ్‌లో ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

సిబ్బందికి కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు

శ్రీ సత్యసాయి, నవంబరు 6, అమరావతి వెలుగు : జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు



చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కొత్తచెరువులోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 7వ తేదీన (శనివారం) జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.ఓట్ల లెక్కింపులో ప్రతి దశను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని, పారదర్శకతతో పాటు కచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సిబ్బందికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగిసేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

మూడోసారి రక్తదానం చేసి చిన్నారి
ప్రాణాలు కాపాడిన లక్ష్మ నాయక్

అత్యవసర సమయంలో స్పందించి ఏబీ పాజిటివ్ రక్తం అందజేత...

లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ అభినందనలు

గుంతకల్లు, నవంబరు 06, అమరావతి వెలుగు : ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలనే సందేశాన్ని ఆచరణలో చూపించారు ఆర్. లక్ష్మ నాయక్.గుంతకల్లు పట్టణంలోని సాయి కృష్ణ



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారికి ఏబీ పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో సమాచారం అందుకున్న ఆయన వెంటనే స్పందించి రక్తదానం చేశారు. వజ్రకరూరు మండలం వెంకటాపల్లి చిన్న తండాకు చెందిన ఆర్.లక్ష్మ నాయక్ గుంతకల్లులోని సన్ లైఫ్ హాస్పిటల్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. చిన్నారికి ఏబీ పాజిటివ్ రక్తం అవసరమని తెలియగానే తన రక్తగ్రూపు కూడా అదే కావడంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోపి బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా లక్ష్మ నాయక్ మాట్లాడుతూ... అత్యవసర సమయంలో రక్తం అందక ఎవరూ ఇబ్బందులు పడకూడదని, రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు మూడుసార్లు రక్తదానం చేసిన లక్ష్మ నాయక్ సేవలను లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ సభ్యులు అభినందించారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక రక్తదాత ముందుకు రావాలనే లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తోందని పేర్కొన్నారు.రక్తదానం చేద్దాం.. ఆపదలో ఉన్న వారికి నిండు నూరేళ్ల జీవితాన్ని బహుమతిగా ఇద్దాం అనే సందేశాన్ని ఈ సందర్భంగా చాటిచెప్పారు.

శ్రీనివాసమంగాపురంలో వైభవంగా...
పవిత్రోత్సవాలు

కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

తిరుమల, నవంబరు 6, అమరావతి వెలుగు : శ్రీనివాసమంగా పురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు రెండో రోజు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేదమంత్రో చ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనా మార్చనతో కొనసాగాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులను యాగశాలకు వేంచేపు చేసి పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర వైదిక క్రతువులను నిర్వహించారు.ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యా హ్నం 12 నుంచి ఒంటి గంట వరకు మూలవర్లతో పాటు ఉత్సవమూర్తులకు పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం స్వామివారు, అమ్మవార్లు తిరుచ్చిపై అలయ నాలుగు మాడ వీధుల్లో విహరించనుండగా, రాత్రి యాగశాలలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ హరికృష్ణ, ఆలయ తనిఖీ అధికారులు ధనశేఖర్, మునికుమార్, ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.





లింగాల మండలంలో...
నేడు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫలితాలు

తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు, జెడ్పీటీసీ వీరంపై ఉత్కంఠ.. అభ్యర్థుల్లో పెరుగుతున్న టెన్షన్

లింగాల, నవంబరు 6, అమరావతి వెలుగు : మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాల కోసం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల రాజకీయ భవితవ్యం శనివారం తేలనుంది. తమకే విజయం వరిస్తుందన్న ధీమాతో అభ్యర్థులు ఉండగా, ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఫలితాలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 7వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుం ది. మండలంలోని తొమ్మిది ఎంపీటీసీ స్థానాలతో పాటు జెడ్పీటీసీ స్థానానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. లెక్కింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే విజేతలను ప్రకటించనున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ అభ్యర్థుల గెలుపోటములపై చర్చలు జోరందుకున్నాయి. ఏ పార్టీకి ప్రజలు పట్టం కట్టారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఓట్ల లెక్కింపునకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపడు తుండగా, ఫలితాల కోసం అభ్యర్థులు, అనుచరులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.



పవన, సౌర విద్యుత్‌తో రైతులకు కొత్త ఆదాయ బాటలు

అనంతపురం, కర్నూలు జిల్లాల్లో విస్తరిస్తున్న ప్రాజెక్టులు.. గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు

అనంతపురం / కర్నూలు , నవంబరు 06, అమరావతి వెలుగు : వ్యవసాయంపై ఆధారపడిన రైతు కుటుంబాలకు అదనపు ఆదాయ మార్గాలను అందించడంతో పాటు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా అనంతపురం, కర్నూలు జిల్లాల్లో విస్తరిస్తున్న పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు గ్రామీణ ప్రాంతాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.వర్షాభావ పరిస్థితులు, పంట దిగుబడుల్లో మార్పులు, మార్కెట్ ధరల ఒడిదుడుకులతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయానికి అనుబంధంగా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు అందుబాటులోకి రావడం ప్రయోజనకరమని రైతులు అభిప్రాయపడుతున్నారు. సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు గ్రామీణ ప్రాంతాలకు కొత్త అవకాశాలను తీసుకొస్తున్నాయి. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన రైతు రవి మాట్లాడుతూ, పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులు రైతు కుటుంబాలకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పించగలవని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ యువతకు ఉపాధి లభించడం సంతోషకరమన్నారు.కూడేరు మండలం



మరుట్ల గ్రామానికి చెందిన రైతు ప్రకాష్ మాట్లాడుతూ, ప్రాజెక్టుల ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు రహదారులు, రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. స్థానికంగానే ఉపాధి లభిస్తే యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.అదే గ్రామానికి చెందిన రైతు వెంకయ్య మాట్లాడుతూ, స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తితో పాటు రైతులకు, గ్రామీణ ప్రజలకు ప్రయోజనం చేకూరినప్పుడే ఇటువంటి ప్రాజెక్టులకు మరింత ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కర్నూలు జిల్లాలోనూ పవన విద్యుత్ ప్రాజెక్టులపై రైతుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది. తుగ్గలి మండలం రతన గ్రామానికి చెందిన మాజీ రైతు లక్ష్మన్న మాట్లాడుతూ, పవన విద్యుత్ ప్రాజెక్టులు గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పురోగతికి తోడ్పడతాయని తెలిపారు. రైతులకు అదనపు ఆదాయం, స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా ప్రాజెక్టులు అమలైతే గ్రామాలకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.అయితే ఈ ప్రాజెక్టుల ద్వారా ఆశించిన ఫలితాలు సాధించాలంటే రైతులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం కీలకమని పలువురు పేర్కొంటున్నారు. ప్రాజెక్టుల వివరాలను పారదర్శకంగా వెల్లడించడం, రైతులతో నిరంతరం సంప్రదింపులు జరపడం, వర్తించే చోట న్యాయమైన పరిహారం అందించడం, స్థానిక సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై నిర్వాహకులు దృష్టి సారించాలని కోరుతున్నారు. మొత్తంగా పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులు కేవలం విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా రైతుల ఆదాయం పెంపు, యువతకు ఉపాధి, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడితే అనంతపురం, కర్నూలు జిల్లాల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతం లభించనుంది.

జిల్లాలో డివిజన్ల వారీగా కౌంటింగ్ కేంద్రాలు..

పటిష్ఠ పోలీసు బందోబస్తు

పుట్టపర్తి, నవంబరు 06, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు డివిజన్ల వారీగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. కదిరి డివిజన్‌కు ప్రభుత్వ బాలికల కళాశాల, పుట్టపర్తి డివిజన్‌కు కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, మడకశిర డివిజన్‌కు ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల, పెనుకొండ డివిజన్‌కు పరిటాల శ్రీరా ములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కేటా యించారు. హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి మండలాలకు బాలికల పాలిటెక్నిక్ కళాశాల, ధర్మవరం డివిజన్‌కు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జిల్లాలోని 377 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 258 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయగా, 801 మంది సిబ్బందితో పాటు 192 మంది ప్రత్యేక సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.





డీఎస్పీ మాణిక్యరావు ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు.. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు పుట్టపర్తి డీఎస్పీ సి. మాణిక్యరావు ఆధ్వర్యంలో కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అదనపు పోలీసు బలగాలను మోహరించడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు... జిల్లాలో పోలీసు యాక్ట్ 30తో పాటు బీఎన్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉన్నందున ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు హెచ్చరించారు. గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు, గొడవలకు పాల్పడినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మాణిక్యరావు తెలిపారు.

కౌంటింగ్‌కు మూడంచెల..

పోలీసు భద్రత..

సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా

శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు 6, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా శనివారం జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎన్. సతీష్ కుమార్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూ డంచెల భద్రత ఏర్పాటు చేయ డంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా కేంద్రాలు, పరిసర ప్రాంతాలపై నిరంతర నిఘా కొనసాగిస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు పికెట్లు ఏర్పాటు చేసి విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్‌ను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.



విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు... ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉంటాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా సంచరించడం, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారాలు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే పోస్టులు పెట్టడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కవ్వింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా బాధ్యులపై కఠిన కేసులు నమోదు చేసి చట్టపర మైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేందుకు రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఆత్మస్థైర్యంతో కోలుకుంటున్న గోపిక

బెంగళూరు, నవంబరు 06, అమరావతి వెలుగు : రాప్తాడు ఘటనలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని గోపిక ఆరోగ్యం










క్రమంగా మెరుగుపడుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. త్వరలో పాఠశాలకు వెళ్లి పదో తరగతి పరీక్షలు రాస్తానని గోపిక ఆత్మవిశ్వాసంతో చెబుతోందన్నారు. శుక్రవారం మంత్రి సవిత ఆసుపత్రికి వెళ్లి గోపికను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గురువారం నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైందని, బాలిక కోలుకుంటోందని వైద్యులు తెలిపినట్లు వెల్లడించారు. మంత్రి నారా లోకేశ్ గోపికకు మెరుగైన వైద్యం అందిస్తూ, సొంత బిడ్డలా ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. తనకు అండగా నిలిచిన మంత్రి లోకేశ్‌కు గోపిక కృతజ్ఞతలు తెలిపిందన్నారు. బాధిత బాలికకు, ఆమె కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మహిళలు, బాలికల భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, వారిపై దాడులు, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాప్తాడు ఘటన నిందితుడు హేమంత్‌ను కాపాడేందుకు వైఎస్ జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి ఆరోపించారు. నిందితుడికి న్యాయ సహాయం అందించేందుకు హైకోర్టులో పిల్ దాఖలు చేయించారని విమర్శించారు. నిందితుడిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గోపిక త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కూటమి విజయంతో మరింత...

బాధ్యత పెరిగింది

అమరావతి, నవంబరు 6, అమరావతి వెలుగు : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను బీజేపీ జాతీయ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి విజయవాడలోని ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో లోకేశ్‌కు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాన్ని లోకేశ్‌కు బహూకరించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గుర్తించారని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ఘన విజయం అందించారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి నేతలపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రగతికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి నేతలు కృషి చేస్తారని చెప్పారు.



కొట్టనూరు రైల్వే గేట్ సమీపంలో...

గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, నవంబరు6, అమరావతి వెలుగు : హిందూపురం పట్టణంలోని కొట్టనూరు రైల్వే గేట్ పక్కన ఉన్న ఫ్లైఓవర్ కింద సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు అనంతపురం జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుడి శరీరం బాగా లావుగా ఉండి, తెలుపు రంగు ఫుల్ బనియన్, పచ్చ రంగు నైట్ ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడిని గుర్తించిన వారు లేదా అతడి వివరాలు తెలిసిన వారు హిందూపురం జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని కోరారు. వివరాల కోసం 92475 75615 నంబరును సంప్రదించవచ్చని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



మున్సిపల్ వైస్‌చైర్మన్ పదవి...

ముస్లిం మైనార్టీలకు కేటాయించాలి

హిందూపురం, నవంబరు 06, అమరావతి వెలుగు : మున్సిపల్ వైస్‌చైర్మన్ పదవిని ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి కేటాయించాలని ముస్లిం ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి



చేశారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కల్లూరు ఉమర్ ఫరూఖ్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు కోరారు. ఈ సందర్భంగా ఉమర్ ఫరూఖ్ ఖాన్ మాట్లాడుతూ ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో వివిధ పార్టీల తరపున ముస్లిం సామాజిక వర్గానికి చెందిన 18 మంది కౌన్సిలర్లు విజయం సాధించారని తెలిపారు. ముస్లిం జనాభా దామాషా, సామాజిక న్యాయం, గతంలో కొనసాగిన సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని మున్సిపల్ వైస్‌చైర్మన్ పదవిని ముస్లిం మైనార్టీలకు కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలను కోరారు. ఈ సమావేశంలో మౌలానా ఫయాజ్, మౌలానా వసీవుల్లా, మౌలానా తన్వీర్, ఉబేదుల్లా హుస్సేన్, ఫ్రూట్ రెహమాన్, అహ్లే సున్నత్ జమాత్‌కు చెందిన షౌకత్, నాహీద్, అల్తాఫ్ తదితర ముస్లిం ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు

రూ.30 లక్షల వరకు పరిహారం

అమరావతి, నవంబరు6, అమరావతి వెలుగు ఎన్నికల విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఈ మేరకు జీఓ ఎంఎస్ నంబర్ 1346ను విడుదల చేసింది. ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల విధుల్లో హింసాత్మక ఘటనల కారణంగా ఉద్యోగి మరణిస్తే బాధిత కుటుంబానికి రూ. 30 లక్షలు, అనివార్య కారణాలతో సాధారణ మరణం సంభవిస్తే రూ. 15 లక్షల పరిహారం అందజేయనున్నారు. ఎన్నికల విధుల్లో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందేలా తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం ఎన్నికల విధుల్లో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవనుంది.

జడ్పీటీసీ, ఎంపీటీసీ కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

అనంతపురం, నవంబరు6, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 11 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అనంతపురం, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, రాప్తాడు, సింగనమల మండలాల ఓట్లు లెక్కించనున్నారు. జేఎన్టీయూ యూనివర్సిటీలో నార్పల, గార్లదిన్నె మండలాలు, జేఎన్టీయూ కళాశాలలో పుట్లూరు, యల్లనూరు మండలాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాల ఓట్లు లెక్కించనున్నారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో కంబదూరు, సెట్టూరు, గుమ్మగట్ట, కుందుర్పి మండలాల ఓట్లు లెక్కించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళ్యాణదుర్గం, బెలుగుప్ప, బ్రహ్మసముద్రం మండలాలు, ఎస్వీడీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బొమ్మనహాల్, డి.హీరేహాల్, రాయదుర్గం, కనేకల్ మండలాల ఓట్ల లెక్కింపు జరగనుంది. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుంతకల్లులోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గుత్తి, యాడికి, గుంతకల్లు, పెద్దవడుగూరు, పామిడి మండలాల ఓట్లు లెక్కించనున్నారు. ఉరవకొండ ఎస్కేపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉరవకొండ, కూడేరు మండలాల ఓట్లు లెక్కించనున్నారు. ఉరవకొండలోని శ్రీ కరిబసవన్న స్వామి ఉన్నత పాఠశాలలో వజ్రకరూరు మండలానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మూడు అంచెల భద్రత ఏర్పాటు చేయడంతో పాటు గుర్తింపు కార్డులు కలిగిన ఎన్నికల ఏజెంట్లు, సిబ్బందికి మాత్రమే ప్రాంగణాల్లోకి అనుమతి కల్పించనున్నారు. నిరం తర విద్యుత్ సరఫరా, తాగునీరు, అత్యవసర వైద్య శిబిరాలు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సం బంధిత శాఖల అధికా రులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది.







పోలీసుల అండతో కూటమి సర్కార్ పరిషత్ ఎన్నికల్లో

అక్రమాలకు పాల్పడింది

-మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

నెల్లూరు, నవంబరు6, అమరావతి వెలుగు : జిల్లాలో నిన్న ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ పరిషత్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని తమ ప్రైవేట్ సైన్యంగా వాడుకుంటూ తీవ్రస్థాయిలో అరాచకాలు, బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్‌కు ఒడిగట్టిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరులోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి వైఎస్ఆర్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను ఉగ్రవాదుల్లా అర్ధరాత్రి వేళ పోలీస్ స్టేషన్లలో అక్రమంగా నిర్బంధించారని, పలుచోట్ల విపక్ష నేతలు, కార్యకర్తలపై రక్తపాతం సృష్టించినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నిబంధనలు ఉల్లంఘించి బూతుల్లోకి చొరబడి రిగ్గింగ్‌కు పాల్పడడమే కాకుండా, ఎస్పై, సీఐ స్థాయి అధికారులే స్వయంగా తమ ఏజెంట్లను బయటకు నెట్టివేసి దొంగ ఓట్లు వేయించారని ఆధారాలతో సహా వివరించారు. ఈ మొత్తం ఉదంతాలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాలని, ఉల్లంఘనలు జరిగిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను తక్షణమే రద్దు చేసి రీపోలింగ్ నిర్వహించాలని, అప్పటివరకు రేపటి కౌంటింగ్ ప్రక్రియను నిలిపివేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.



Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576